# తప్పెవరిది?

నేను స్కూలు ఫైనల్ చదువుతుంటే రోజులవి. మామూలుగా సాయంకాలం స్కూలునుండి వచ్చి, పుస్తకాలు బీరువాలో పడేసి వీధి అరుగుమీద కూర్చున్నా! "నాయనా! రేపు స్కూలుకు వెళతావేమో మర్చిపోయి, సెలవుపెట్టు." అంది మా అమ్మ వెనకాలేవచ్చి. "ఏం సంగతమ్మా!" అన్నాను. అదేమిట్రా! ఇంతట్లోకే మర్చిపోయావ్! రేపు మన అవధాన్లు మామయ్యగారింట్లో శుభకార్యం జరుగుతుంటేను" అంది.

"ఏం శుభకార్యమమ్మా?" "సరిపోయిందిరా! రేపు మన కామాక్షికి శోభనం కదూ?"

"అయితే నేనెందుకు సెలవుపెట్టాలి?"

"అలాగంటా వేమిట్రా! మామయ్యగారు మరీమరీ చెప్పారు, రేపు మనల్నందర్నీ భోజనానికి రమ్మనమనీ."

"నాకు పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి. ఇప్పుడు సెలవుపెట్టడానికి వీల్లేదు. అయినా చూస్తాలే" అన్నాను ఏదో ఆలోచిస్తూ.

"రా! శోభనం పెళ్ళికూతురా! అప్పుడే అమ్మల్ని చిన్నచూపు చూస్తున్నావు. ఇంక రేపు కాపురంచేస్తుంటే, ఎప్పుడైనా గుమ్మంలోకి వస్తే ఎవరుమీరని అడుగుతావు." అంది మా అమ్మ, అప్పుడే వస్తున్న కామాక్షిని చూసి.

"రేపు మీ బావ స్కూలుకి వెళతాట్ట. అదేమిటో నువ్వే చూడమ్మా. నే నెన్ని సార్లు చెప్పినా ససేమిరా అంటున్నాడు." అంటూ మా అమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

"అనిల్‌కుమార్"

"అవునా! బావా? అంది కామాక్షి!

"ఏమిటి!" అన్నాను.

"రేపు స్కూలుకు వెడతావా?"

"మరి...కార్యం నీకైతే... నేనెందుకూ ...మధ్య...అయినా నాకు పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి."

"రేపు వెడితే నామీద వట్టే...... మా నాన్నగారు కూడా చెప్పమన్నారు నీతో. 'రేపు సుందరం బావ మరిచిపోయి స్కూలుకు వెడతాడేమో, వెళ్లొద్దని చెప్పిరా' అని."

"అయితే పిలుపు పిలవడానికి వచ్చావన్న మాట" అన్నాను నవ్వుతూ.

"పో! బావా! నీకంతా వేళాకోళమే. పిల్లికి చెరలాటం ఎలక్కి ప్రాణసంకటంలా వుంది. అయినా బావా......" అంటూ అదోలా ముఖం పెట్టింది కామాక్షి.

"ఏమిటది కామాక్షీ!" అన్నాను ముఖం లోకి చూస్తూ.

"నాకేదో భయంగా వుంది బావా..." అంది. నాకు అపుకోలేనంత నవ్వు వచ్చింది. అది చూచి కామాక్షి ఏమనుకొందో ఏమిటో "నన్ను చూస్తే నీకంత నవ్వులాటగా వుంది" అంటూ చిరుకోపంతో రివ్వుమని మెరపులా వాళ్లింటికి వెళ్లిపోయింది.

అవధాన్లుగారి కుటుంబానికీ, మా కుటుంబానికీ కొంచెం దూరపు బంధుత్వం వుంది. అవధాన్లుగారికి బాగా వయస్సు వచ్చిన తర్వాత పెళ్లి అయింది. అయినా వారిది అనురాగ దాంపత్యం అనడానికి అభ్యంతరం ఏమీ లేదు. వారికి అపురూపంగా పుట్టింది ఈ కామాక్షి. తల్లో నాలుకలా వుంటున్నారు ఈ రెండిళ్ల వాళ్లూ. నేను థర్డుఫారం దాకా మా పినతండ్రిగారి ఊళ్లో చదివాను. తరవాత మళ్లీ మా వూరు వచ్చేశాను హైస్కూల్లో చదువుకి. ఈ రెండు మూడేళ్లలోనూ, కామాక్షికీ నాకూ అపరిమితమైన చనువు ఏర్పడిపోయింది. ఎనిమిదవ ఏటే కామాక్షికి పెళ్లి చేశారు. అది తలచుకొంటే నాకు కామాక్షిమీద ఎంతో జాలి వేస్తుంది. శాస్త్రమూ మతమూ పేరిట ఈ పండితులు చేసే దురంతాలకు పట్టరాని ఆగ్రహం వచ్చింది నాకు.

కామాక్షి కిప్పుడు 12 వ ఏడు. పసిడి కలాకలా వుంటుంది. తొలి యవ్వనపు వెలుగులు విరజిమ్మే విశాల నయనాలు. అందులో కౌతుకకళ్లు. నవ్వితే ముత్యాలు రాలుతాయి. ఎప్పుడూ నవ్వుతోనే వుంటుంది నన్ను ఒక్క క్షణం చూడకపోతే "బావ ఇంకా రాలేదూ..." అంటూ మా ఇల్లంతా కదనుత్రొక్కుతుంది. అటువంటి కామాక్షికి ఎటువంటి ద్రోహం చేశారు ఈ పెద్దలు! కామాక్షి తల్లికో తమ్ముడున్నాడు. అతనికి మొదటిభార్య పోయింది. కూతురికి ఎక్కడో దూరపుసంబంధం ఎందుకు, తన తమ్ముడికే చేస్తే, దగ్గరగా కంటికి కనబడుతూ ఉంటుందని అతనికిచ్చి ఆఖరికి కట్టబెట్టారు. అతని వయస్సు సుమారు ముప్పైఅయిదు వుంటుంది. పొట్టిగా, లావుగా, చామనచాయగా వుంటాడు. ఉబ్బసరోగం. రైల్వేలో అసిస్టెంటు స్టేషనుమాస్టరుగా పని చేస్తున్నాడు. పెద్దల సులువుబలువులకోసం అన్నెమూ పున్నెమూ ఎరుగని అమాయిక కన్యల జీవితాల నిలా ఆహుతి చేస్తున్నారు. ఇవేనా, మునీశ్వరులు లిఖించి విడిచిపోయిన ధర్మశాసనాలు? అతనికి వండిపెట్టే వాళ్లు లేక నానాయిబ్బందీ పడుతున్నాట్ట అందుచేత కామాక్షి పెద్దమనిషవకుండానే కార్యం చేస్తున్నారు! ఈ అడ్డు రోజంతా తీరిపోతే అతను తీసుకెళ్ళడానికి అనుకూలంగా వుంటుందని.

ఉగాది
అభివందనాలు
మా తెలుగు క్రాస్‌వర్డు పజిలు పోటీదారులకు, ఆంధ్రప్రజలకు "నందన" నామ సంవత్సరము ఆనందదాయక మగుగాక!
SRI SATYA DEV & Co.,
Kachiguda, Hyderabad-Dn:
మా పజిల్ నెం. 24 కు పోటీచేసి
రూ 1,500 గెలవండి!
వివరములకు ఒక కార్డు వ్రాయండి

మరునాడు పగటి కార్యక్రమం అంతా దివ్యంగా జరిగింది. ఇంక రాత్రి కార్యక్రమం అంతా ఆడవాళ్లదే. ఇదంతా చూస్తోంటే, నాకు నిజంగా, వీళ్ళంతా మనుష్యులా, పశువులా అనిపించింది. మొగుడంటే ఏమిటో తెలియని అజ్ఞానపుదశలో పెళ్ళయింది. ప్రపంచమంటే ఏమిటో తెలియని పసిప్రాయంలో కార్యమా ? ఆ సాయంత్రం అవధాన్లుగారు నన్ను పిలిచి "సుందరం! బజారుకెళ్లి చామంతిపూవులూ పంచదార చిలకలూ పట్టుకురా" అంటూ నా చేతికి డబ్బిచ్చారు. లేనంటే, ఏం కొంపమునుగుతుందో అని ఎల్లాగో వెళ్లివచ్చాను. ఇంక వాళ్ళింటికి వెళ్ళలేదు ఆరోజుకి. మరునాడు మామూలుగా స్కూలుకు పోయాను. రాత్రిభోజనం చేసి వీధి అరుగుమీద గదిలో కూర్చున్నాను చదువుకోడానికి. మా అమ్మకూడా పని పాటలుచేసుకొని అరుగుమీదకి వచ్చింది. ఇంతలో ఒక్కొక్కళ్ళే కమిటీ సభ్యులంతా వచ్చి చేరుకొంటున్నారు. అందులో ముప్పాతికమంది ఆరితేరిన అయిదోతనం లేని అతివలే, ఒక్కమా అమ్మ మినహా. మా అమ్మ ఈ సభకి అధ్యక్షురాలు.

'నిన్నరాత్రి పడకటింటి ముచ్చట్లు ఏమైనా తెలుసులే వెంకటలక్ష్మీ నీకు" అంటూ ప్రస్తావన బయలుదేరింది.

"ముచ్చట్లు ఏమిటే...ఏడుపులూ పెడబొబ్బలూను" అంది ఓముసలావిడ.

"అసలు ఇంతకీ ఏం జరిగిందేమిటే పిన్నీ..." అంది ఓ బాలవితంతువు

"ఏం జరగడం ఏమిటే నీ మొఖం చచ్చేట్లా దాన్ని బాదేడట, వెర్రపిల్లదానికేం తెలుసునని చెప్పవొదినా"

"అయినా సమర్తాడకుండా శోభనం చేయడం ఏమిట్రా!" అంది పళ్ళూడిపోయిన ఓముసలమ్మ వణుకుతూ.

"అదేమిటమ్మా! అంతా చోద్యంమీది. కామాక్షీ తల్లిమాటేమిటో చెప్పదురూ ఒక్క ముక్క. ఆవిడకు మాత్రం సమర్తాడకుండానే కదూ కార్యం జరుగుతా... ఆ తల్లి సాంప్రదాయమే దీనికిన్నీ" అంది ఓముప్పేలేని ముత్తైదువ.

"ఏదో వెర్రపిల్లవునా...సిగ్గు చేతో మరేమో తలుపు పాదిగట్టుకేసి అలా కూర్చుండిపోయిందట. మరి ఆ మొగుడు అంత ఎద్దు మొద్దు స్వరూపం అవుతే ఎల్లాగూ. రెండుసార్లు పిలిచి మూడోసారి రెక్కపట్టుకు లాగాడట.

అది రానని గింజుకొందిట. ఆ పళంగా అలా పట్టుకొని "ఛెళ్లు, ఛెళ్లున లెంపలు వాయించేయడమే! దాంతో అది ఒకటే గోల. ఆ మొగుడు తలుపు తీసుకొని యివతలికి వచ్చేశాడట ధుమ ధుమ లాడుతూ. ఈ రోజు అసలు అది గదిలోకే వెళ్లనందిట. ఆఖరికి బ్రహ్మండంమీద తల్లీ, తండ్రీ నచ్చజెప్పి, దాన్ని ఏమీ అనవద్దని అల్లుడికి మనవి చేసుకుని ఎల్లాగైతేనేం లోపలికి తోసి గొళ్లెం పెట్టారట."

"ఇంత రభసా జరిగిందన్న మాట. నాకు కొంచం గూడ తెలియలేదు పిన్నిగారూ"

"అదంతా సరేగాని, ఎల్లుండి దాన్ని తీసుకుపోతాట్ట కూడాను."

"బాగుంది. చాలా అందంగా వుంది.



ఆఖరికి కుర్రదాన్ని, ఆ వూరుకాని వూరు తీసుకెళ్లి ఏం బాధలు పెడతాడో" అంటూ అందరూ సానుభూతి తెల్పుతూ ఎవళ్ళ తన్న వాళ్లు వెళ్లిపోయారు.

మర్నాడు మేము కాఫీ త్రాగుతుంటే, కామాక్షి మొగుడు మా యింటికి వచ్చాడు. "ఏం! పిన్నీ బాగా వున్నారా? బాబు ఊళ్లో లేరా ఏమిటి? ఎక్కడా కనబడ లేదు" అని పలకరించాడు.

"రా నాయనా! ఇలా కూర్చో! ఏదో ఇలా ఉన్నాం. మీ బాబుగారు ఏవో పెళ్లిళ్లు చేయించడానికి వెళ్లారు. అంతా నాలుగు రోజులయింది. బహుశా రేపు రావచ్చు. కొంచెం కాఫీ పుచ్చుకో" అంటూ గ్లాసు చేతికందించింది. కాఫీ త్రాగేక గ్లాసు కిందపెడుతూ నన్ను చూసి "ఏరా! సుందరం! ఏం చదువుతున్నావు" అన్నాడు. "స్కూలు ఫైనలు చదువుతున్నానండి" అన్నాను. "బాగుంది. వస్తా! పిన్నీ" అంటూ లేచాడు.

"రెండురోజులపాటు ఉంటావా?" అంది ఏమీ ఎరగనట్లు మా అమ్మ.

"అబ్బే... రేపు పొద్దున్నే వెళ్ళిపోతాం" అన్నాడు.

"వెళ్ళిపోతాం అని బహువచనం చెబుతున్నావే, కూడా ఎవరువస్తున్నా రేమిటి" అంది ముసి ముసి నవ్వు నవ్వుతూ—

"ఎవ రేమిటిపిన్నీ! మీకోడలు పిల్లని కూడా తీసుకు వెళుతుంటేను" అన్నాడు నవ్వుతూ.

"అదేమిటే, కుర్రనాగమ్మని ఇప్పటి నించీ ఎందుకు...పెద్దమనిషిఅయ్యాక.." అంటుంటే అతను అందుకొని.

"పెద్దమనిషేమిటి పిన్నీ! ఓమూల అష్ట కష్టాలూ పడుతూంటే. ఇన్ని గంజినీళ్లు కాచిపోసే దిక్కెవ్వరూ లేరు. అందుకనే పెద్దమనిషి కాకుండానే, ఆ అడ్డురోవంతా తీర్చేసి మరీ తీసుకెళు తున్నాను." అన్నాడు ముఖం అదోలాపెట్టి.


**అబలసుధ**

స్త్రీల కుసుమ వ్యాధులు, అకాల ఎహిష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ. కాళ్ల లాగుట, మనస్తిమితము లేకపోవుట, నిద్రపట్టకుండుట, నరుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టిరియా మొ॥ హరించును.

సీసా రు. 3/- వి. పి. అ. 0-14-0.

ఇండియన్ మెడికల్ హౌస్,
లక్ష్మీ టాకీసు రోడ్డు - విజయవాడ-2.


"అవున్నాయనా. ఆ వూరుకానివూళ్లో నువ్వు పడేకష్టాలు ఎవ్వరికి తెలుస్తాయి." అంది మా అమ్మ ప్లేటుమారుస్తూ.

"వస్తానమ్మా. ఇంక మళ్ళీ కనబడ్డం వుండదు. ప్రయాణం హడావిడి. వస్తా సుందరం. ఏదో కొంచం శ్రద్ధగా చదివి ఎల్లాగో గట్టెక్కెయ్యి. పాపం మీఅమ్మా, నాన్నా ఎంతో కష్టపడుతున్నారు నీచదువు కోసం" అంటూ వెళ్లిపోయాడు.

ఆ రోజుస్కూలునుండి ఇంటికి వచ్చే సరికి బాగా చీకటిపడింది. ఇన్ని మెతుకులు నోట్లో వేసుకొని మామూలుగా వీధి గదిలో కూర్చొని చదువుతున్నాను. మా అమ్మ సావిట్లోనిద్రపోతోంది. నామనస్సు ఈ నాలుగురోజులనుంచీ సరిగ్గా లేదు. పాపం అమాయకురాలైన కామాక్షిని తలచుకొంటుంటే నాకు ఏదో చెప్పరాని బాధ కలుగుతోంది. ఆనందలక్ష్మిలా కలకల్లాడుతూ కళ్లెదుట తిరిగే కామాక్షి ఇంక రేపటినుంచీ కనబడదు. ఎందుచేతనో కామాక్షి అంటే నాకు అదోవిధమైన మమకారం, జాలి, ప్రేమ. ఈ ప్రేమ ఎటువంటిదో ఏ రకమో నేను వివరంగా చెప్పలేను. ఎందుచేతనంటే నాకూ పెళ్ళిఅయింది. ఘోర్తుఘారం చదువుతుంటే, వద్దు మొర్రోఅన్నా వినక, ఓ ఎద్దులాంటి పెళ్లాన్ని కట్టబెట్టారు. ఇవాళో రేపో ఆ నాంచారి రావడానికి సిద్ధంగావుంది. ఆ ఆలోచనలతో నా బుర్రంతా వేడెక్కిపోతోంది. ఇంతలో తలుపుకొట్టిన చప్పుడయింది. "ఎవరు వారు?" అన్నాను. సమాధానం రాలేదు. నెమ్మదిగా తలుపుతీశాను.

"కామాక్షీ!...ఏం ఇంత రాత్రివేళ ఇలా వచ్చావ్." అన్నాను. కాని ఆమె ఏమీ మాట్లాడలేదు. అదరిన మేనుతో, బెదరిన చూపులతో అల్లాగే నాకేసి చూస్తూ నించుంది. "కూర్చో కామాక్షీ" అన్నాను. "వద్దు బావా! వెళ్ళిపోతా" నంది.

"అయితే అంత చెప్పుల్లో కాళ్లు పెట్టుకొని ఎందుకొచ్చావ్?"

"అదికాదు బావా, మరి...నీతో...నీతో..."

"ఏమిటే, నాతో...చెప్పు కామాక్షీ."

"నీతో ఒక్కసారి చెప్పేసి వెళ్లిపోదామని."

"ఏం చెబుతావు? ఎక్కడికి వెళతావు? అన్నాను.

"రేపు ... పొద్దున్నే... ఆయన... నన్ను..." అంటూ రెండుచేతులలో ముఖం కప్పేసుకొంది. నాకు అర్థమయింది.

"పిచ్చిదానా! ఈమాత్రం చెప్పడానికే అంత ఇదిచేశావు. అదేమిటే, ఏడుస్తున్నావా? తప్పుకదూ. ఏదీ ఇలా చూడు" అన్నాను.

"బావా నిన్ను విడిచి ఎలా వెళ్లనూ?"

"ఎలా వెళ్లడం ఏమిటి కామాక్షీ! చక్కగా రేపు మొగుడితో బండిలో కూర్చొని వెళుదుగాని."

"బావా! వేళాకోళమా" అశ్రునయనాలతో నా కళ్లల్లోకి చూస్తూ అంది. ఆ చూపు నా హృదయాంతరాళంలోకి చొచ్చుకుపోయింది. నా మనస్సు చివుక్కుమంది. నేను ఏమీ అనలేకపోయాను. "ఇంక వస్తాబావా! మళ్లీ నేను నిన్ను చూడగలనో లేనో. ఎప్పుడైనా ఈ దీనురాలిని చూడాలనివుంటే ఓసారి అక్కడకు రా" అంటూ లేచింది.

"కామాక్షీ! అనవసరంగా నీ మనస్సు కష్టపెట్టాను. ఏమీ అనుకోవుకదూ. నువ్వు వెళ్లిపోతుంటే నాకుమాత్రం సంతోషమా? తప్పకుండా వేసంగి సెలవుల్లో నిన్ను చూడ్డానికి ఆ వూరు వస్తాను." అన్నాను. కామాక్షి అలాగే చూస్తూ వెళ్లిపోయింది.

కాలచక్రం తిరిగిపోయింది. వైశాఖ మాసంలో నాకు కార్యమయింది. మా నాంచారి ప్రవేశించిన వేళావిశేషమో ఏమో - నా పరీక్ష సున్న అయింది. అందుకనే "వివాహో విద్య నాశాయ, సర్వం పాకాయ శోభనం" అని పెద్దలు ఊరికే అన్నారా? ఎల్లాగో మళ్ళీ ఓ ఏడాది చదివి గట్టెక్కాను. కామాక్షి మళ్ళీ రాలేదు. ఈ లోపుగా పెద్ద మనిషి అయిందనిమాత్రం తెలిసింది. తరువాత నేనూ ఓ రోజున ఉద్యోగం కోసం మిలిటరీలోకి పోయాను. జీవితం ఏదో చప్పగా నడుస్తున్నట్లు తోచింది. ఆ లోటు ఎందువల్లనో నాకు తెలియలేదు. చాలాసార్లు తెలుసుకోవాలని ప్రయత్నించాను కూడా. ఇంటి వద్ద అమ్మా నాన్న ఒకటేగోల పెడుతున్నారు, అక్కడనుంచి వచ్చేయమని. అదే పనిగా టెలిగ్రాములు ఇవ్వడం మొదలు పెట్టారు. ఇంక తప్పనిసరిగా అక్కడ


**నారసింహ లేహ్యము**




బంగారు చేర్చబడినది. మేహము, నికాక్క, నిస్సత్తువ శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

పి. వి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెరిదేపి-నెల్లూరు జిల్లా.

నుంచి ఏదోవిధంగా, నానా తంటాలుపడి డిశ్చార్జి అయి, ఇంటికి వచ్చేస్తున్నాను. నేను ఎక్కివస్తున్న రైలు ఒక జంక్షనులో ఆగింది. మామూలుగా కాఫీ త్రాగడానికి టీస్టాలువద్దకు వెళుతున్నాను. ఇంతలో "ఏంరా! సుందరం! ఎక్కడనుంచి?" అన్న గొంతు వినబడింది. వెనుదిరిగి చూశాను. ఆయాసంగా దగ్గుతూన్న ఒక వ్యక్తిని చూసి ఆఖరికి "మీరా......" అన్నాను. "రా! ఈ రోజు ఇక్కడ ఆగి రేపు వెళుదు గానిలే" అంటూ నా పెట్టె, బెడ్డింగూ పోర్టరుకి ఎత్తి, నన్ను కూడా తీసుకువెళ్లాడు.

ఇంట్లోకి వెళ్లాక "ఏమే! ఎవరో వచ్చారు చూడు" అన్నారు. "ఎవరండీ" అంటూ ఇవతలకొచ్చి నన్ను చూచి నిర్ఘాంతపోతూ "ఏం బావా! ఎక్కడనుంచీ రాక? బాగా ఉన్నావా? ఏమిటీ మిలటరీ వాడి వేషం?" అంది నవ్వుతూ "తరవాత మాట్లాడుకోవచ్చుగాని, ముందర కాఫీ పెట్టి, త్వరగా వంట కానియ్యి" అన్నారు కామాక్షి మొగుడు. "రావోయ్! సుందరం. ఎంత వాడవయ్యావ్! రా! బట్టలు మార్చుకొని స్నానం చెయ్యి. తరవాత మాట్లాడుకుందాం!" అన్నాడు.

కామాక్షి ఎంతలా మారిపోయింది. ఇదివరకున్న పొడుగదిగింది. కొంచెం వన్నెకూడా చేసింది. నాలో ఏదో చెప్పరాని సంతోషం బయలుదేరింది. ఎప్పుడూ లేని ఉత్సాహం కలిగింది. ఒడలు పులకరించింది.

భోజనాలు అయ్యాయి. బడలిక చేత నేను పక్కమీద కన్ను మూశాను. ఒళ్ళు తెలియని నిద్రపట్టింది. "ఇంకా ఏం నిద్ర! లే బావా! సాయంత్రం అయింది. భోజనంవేళ కూడా అవుతోంది" అన్న కామాక్షి పలుకులు విని త్రుళ్ళిపడి లేచాను. "కాఫీ చల్లారిపోతోంది. పట్టుకొస్తానుండు బావా!" అంటూ కాఫీ తెచ్చియిచ్చింది. కాఫీ త్రాగి అలా ఓసారి వీధిలోకి వెళ్ళివచ్చాను. "లే! బావా భోజనం చేద్దాము." అంది కామాక్షి. "అదేమిటి! మీవారు కూడా రానీ" అన్నాను. "ఆయన వచ్చేదాకా వుంటే మాటయితే నీపని సున్నే" అంది కిలకిలా నవ్వుతూ. "అంటే?" అన్నాను. "అంటేనా. ఆయనకి ఈవేళ నైట్ డ్యూటీ, రానని చెప్పి వెళ్లారు." అంది. భోజనానికి వెళ్లాను. ఎంతపరిచయమైనా, ఇంట్లో ఇంకొకళ్ళు లేనందువల్ల అదోలావుంటుంది. అందుచేత నేను బుర్రవంచుకొని భోజనం చేస్తున్నాను. "అందేమిటి బావా! అంత సిగ్గుపడుతున్నావ్. పట్టుమని నాలుగు మెతుకులైనా తినలేదే" అంది. "అబ్బే! ఆకలిలేదు." అన్నాను.

"రాకరాక మాయింటికి అనుకోకుండా వచ్చావు. నిన్ను చూస్తుంటే, నాకు ఎంత సంబరంగా వుందో చెప్పలేను. ఇన్నాళ్లనుంచీ, ఆనందరహితమై, అడవి కాచిన వెన్నెల్లావున్నాను." అంటూ ఇంకా ఏదో చెప్పబోతోంది. "కామాక్షీ! ఏమిటో కవిత్వధోరణిగా మాట్లాడుతున్నావ్. ఎంత పెద్ద దానవయ్యావు." అన్నాను. "సరేలే! భోజనం చెయ్యి తర్వాత మాట్లాడుకోందాం!" అంది. నాకోసం వేసివున్న మంచంమీద సిగరెట్టు కాల్చుకొంటూ కూర్చున్నాను. "బావా! తాంబూలం వేసుకో" అంటూ ఆకులూ, వక్కలూ అన్నీ పళ్లెంలో పెట్టి తెచ్చింది. "నాకు వద్దు కామాక్షీ! అలవాటు లేదు" అన్నాను. "లేకపోతే చేసుకో బావా! నేను స్వయంగా సున్నం రాసి, చిలకలు చుట్టి ఇస్తాను." అంటూ నన్ను తాంబూలం వేసుకొనేదాకా బలవంతం చేసింది.

నేను ఉండబట్టలేక "కామాక్షీ ఈ అలంకారమంతా ఏమిటి?" అన్నాను. "ఇవాళ నాకు పండగ బావా!" అంది. నాకు అర్థం కాక "అంటే?" అన్నాను.

"బావా! ఇంకా అర్థం కాలేదా నీకు? చల్లకొచ్చి ముంతదాచడం దేనికి? కారు మబ్బులు కమ్మినప్పుడే, నెమలి పింఛాన్ని విప్పి నాట్యం చేస్తుంది. చంద్రుడురాగానే కలువలు వికసిస్తాయి. ఇన్నాళ్లనుంచీ ముకుళించుకు పోయిన నా హృదయకమలం ఈ, నీ రాకతో విచ్చుకొంది. ఆనంద దేవత ఇన్నాళ్లకు నాకు ప్రత్యక్షమయింది. ప్రణయదేవత నా వలపు కిన్నెర తంత్రులు మీటుతోంది. బావా...ఏం చెప్పను? నా యీ అయిదేళ్ల జీవితంలోనూ ఈ రోజే నాకు పండుగ. అయినా అది నీచేతిలో వుంది. పాలముంచినా నీటముంచినా నీదే భారం. అంగీకరించావా—ఆనందం. నిరాకరించావా – మరణం."

"కామాక్షీ! ఏమిటీ ధోరణి. నీ మెడలో నిగనిగమెరిసే ఆ తాళి, నీ భర్తకు, నీవు మనసారా వ్రాసియిచ్చిన బానిసపత్రం" అన్నాను.

"అవును. తెలుసు. అది పెద్దలు చేసిన పెళ్లి. నా మెళ్ళోకట్టినది తాళిగాదు. ఉరిత్రాడు. ఇప్పుడు నీ ఎదుట మాట్లాడుతున్నది నీ చిన్నతనపు కామాక్షిగాదు. ఆ అమాయకపు కామాక్షి చనిపోయింది. ఇప్పుడు భగ్నజీవి, అన్నీ తెలిసిన కామాక్షి! ఆచారం పేరిట, శాస్త్రాలను అడ్డు వేసుకొని, ఎంతమంది కన్యల జీవితాలను తడి గుడ్డలతో, కుత్తుకలు త్తరిస్తున్నారో ఈ స్వార్థపరులు? బావా అన్నీ తెలిసిన నీవే ఇలా చేస్తే ఎల్లాగ? కట్టుకొన్న భర్త అనాకారి, రోగి. అయితే వలపుచంపుకొని, విధిలేక పశువులా శరీరాన్ని వాళ్ళకి అర్పించవలసిందేనా? ఈ కరకు సంఘం విధించిన కఠినశిక్ష నిలా అనుభవిస్తూ, క్రుంగి కృశించిపోవలసిందేనా? స్త్రీల యందు ఇంత కాఠిన్యం దేనికి, ఈ స్వార్థపరులకూ, కరకు సంఘానికి? బావా... నా బాధ అర్థంచేసుకోలేవా?" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ నా పాదాలమీద వ్రాలింది. నా హృదయంలో రైళ్లు పరుగెడుతున్నాయి.

పెళ్లి కాకముందు నా కామాక్షి. కాని ఇప్పుడు...పరస్త్రీ! అందులోనూ తిన్న ఇంటి వాసాలు లెక్కించడమా!... ఇంత బంధుద్రోహమా?......ఎన్నో ఆలోచనలతో నా గుండె పగిలిపోతోంది. నా ఇంద్రియచాపల్యం ముందు నా మనోబలం, నిగ్రహశక్తి, క్షీణించిపోయాయి. ఏమి చెయ్యాలో తోచలేదు. కామాక్షి మళ్ళీ తల ఎత్తి, "బావా......ఇదంతా ఎవరి తప్పు?...నా తప్పే నంటావా...?"

నా మనస్సు కరిగిపోయింది. అప్రయత్నంగానే "కామాక్షీ!" అంటూ ఆమెను చేరదీశాను.

"బావా...ఎంత ఆనందం..."

"కామాక్షీ...ఇది ఇద్దరి తప్పూ కాదు"

మరి ఎవరి తప్పు? ★

శతమూలికాదిలేహ్యము

లోహ భ్రకసింధూరముతో సహా సేవించిన సమస్తసుఖవ్యాధులు, ఎలుపు తెలుపు మచ్చలు, బగ్గలు నపుంసకత్వము నివారించి వీర్యవృద్ధి, బలము, నరముల పటుత్వము కలుగజేయును స్త్రీలబుతుశూలలు, కుసుమరోగములు, నష్టసంతానము నివారించి మంచిసంతానము కలుగజేయును. 40 దినములకు మందు రు 18.

శ్రీ భుజంగరావైద్యశాల

తాళ్ళరేవు, తూర్పు గోదావరి జిల్లా.